ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



తమిళనాడు
TAMILNADU

శనివారం 2 నవంబరు 2024



నగరాన్ని కమ్మేసిన పొగ

● దీపావళి ఎఫెక్ట్

చెన్నైలో పెరిగిన వాయు కాలుష్యం

● ఆలందూరు, పెరుంగుడిలోనే అధికం!

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నగరంలోని శివారు ప్రాంతాల్లో గురువారం రాత్రి మునుపెన్నడూ లేనంతగా బాణసంచా పేల్చటంతో దేశ రాజధాని ఢిల్లీకి దీటుగా వాయుకాలుష్యం విపరీతంగా పెరిగింది. ఈ యేడాది అత్యధికంగా బాణసంచా పేల్చినట్లు కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారుల క్షేత్ర పరిశీలనలలో వెల్లడైంది. రాకెట్ టపాసులు ఆకాశంలో వెలుగులు చిమ్మడం, పెద్ద శబ్దంతో పేలే టపాసులు, ఆటంబాంబులు, వరుసగా పేలే వంద, రెండు వందలు, ఐదొందలు, వెయ్యి టపాసుల శరాలను నగవాసులు పేల్చి దీపావళి పండుగను సంతోషంగా జరుపుకున్నారు. నగర శివారు ప్రాంతాల్లో పది నిమిషాలు, 20 నిమిషాలపాటు పేలే టపాసులు కూడా అధిక సంఖ్యలో పేల్చారు.



ఇలా చెవులు పిక్కటిల్లేలా కాల్చిన బాణసంచా కారణంగా చెన్నైలోని పలుచోట్ల వాయుకాలుష్యం తీవ్ర రూపం దాల్చింది. నగరంలో బాణసంచా కాల్చటం వల్ల అత్యధికం వాయుకాలుష్యం ఏర్పడిన ప్రాంతంగా ఆలందూరు ప్రాంతం ప్రథమస్థానం పొందింది. ఆలందూరులో వాయు ప్రమాణ సూచిక 246గా నమోదైంది. ఇదే విధంగా పెరుంగుడి బస్‌డిపో ప్రాంతం వద్ద ఆ సూచిక 230గా, వేళచ్చేరి నివాస ప్రాంతాల్లో ఆ సూచిక 226గా నమోదయ్యాయి. జాతీయ వాయు ప్రమాణ సూచిక 50 నుంచి 200 దాకా నమోదైతే ఆరోగ్యానికి, ప్రత్యేకించి ఊపిరితిత్తులకు ఎలాంటి హాని జరగదు. 201 నుంచి 300లోపున నమోదైతే ఆరోగ్యానికి హానికరం. అరుంబాక్కంలో 163, మనలిలో 113, కొడుంగయూరు 107, మనలిలో 133, రాయపురంలో 74 చొప్పున వాయు ప్రమాణ సూచికలుగా నమోదైనట్లు స్థానిక కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రకటించారు.

544 మందికి గాయాలు..

రాష్ట్రవ్యాప్తంగా దీపావళి సందర్భంగా బాణసంచా పేలుళ్ల కారణంగా 544 మందికి గాయాలయ్యాయి. చెన్నైలో 90 మందికి పైగా గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారని ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. వీరందరికి ఒంటిపై 2 నుంచి 28 శాతం వరకూ కాలిన గాయాలున్నట్లు తెలిపారు. ఇక బాణసంచా పేలుడు వల్ల పలు చోట్ల స్వల్పస్థాయిలో అగ్ని ప్రమాదాలు సంభవించినట్లు అగ్నిమాపక దళం అధికారులు తెలిపారు. నగరమంతటా 102 ప్రాంతాల్లో మంటలను ఆర్పినట్లు చెప్పారు. గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చేందుకు అంబులెన్స్ సేవలు వినియోగించినట్లు తెలిపారు.

347 మందిపై కేసులు..

ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి మించి టపాకాయలు పేల్చిన 347 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీపావళి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, అదే విధంగా సాయంత్రం 6 నుంచి 8 గంటల దాకా టపాకాయలు కాల్చాలని పోలీసులు నిబంధన విధించారు. లో పలు చోట్ల ఈ నిబంధనను ఉల్లగించి ఉదయం 8 గంటల తర్వాత, రాత్రి 8 గంటల తర్వాత కూడా టపాకాయలు కాల్చారు. బుధ, గురువారాల్లో నగరమంతటా పోలీసులు నిఘా వేసి ఈ నిబంధనలు ఉల్లఘించిన 347 మందిపై కేసులు నమోదు చేశారు.

ఆకాశమంతా దీపావళి



టపాసుల వెలుగుల్లో రాజధాని నగరం



టపాసులు కాల్చుతున్న ఆనందంలో చిన్నారులు

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెలుగుల పండుగ దీపావళిని అత్యంత వైభవంగా జరుపుకున్నారు. గురువారం తెల్లవారుజామునే ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి వివిధ రకాల పూజలు నిర్వహించారు. అలాగే, రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నెయ్యితో నింపిన మట్టి ప్రమిదలు వెలిగించి ఇళ్లు, కార్యాలయ ప్రాంగణాలను అలంకరించారు. ఆ వెలుగుల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా టపాకాయలు కాల్చి కేరింతలు కొట్టారు. సంప్రదాయ దీపావళి పండుగ రోజున రాక్షసత్వం నశించి రాష్ట్రంలో వెలుగులు విరజిమ్మాలన్న కోరికతో రకరకాల మిఠాయిలు, నోరూరించే వంటకాలు రుచిచూశారు. బాణసంచా ధర పెరిగినప్పటికీ, పండుగ రోజు నరకాసురుడిని వధించే ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ మతాబులు, చిచ్చుబుడ్లు, రాకెట్లు, టపాసులు పేల్చి హోరెత్తించారు. కొత్తగా పెళ్లయిన జంటలు అత్తారింటికి వెళ్లి విందు, వినోదాలతో సరదాగా గడిపారు.



కాకర పూవ్వొత్తుల వెలుగుల్లో చిన్నారి

రెండు బైకుల ఢీ

ముగ్గురు స్నేహితుల దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు మిత్రులు (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా కంభం సమీపంలో రెండు బైకులు ఢీకొని ముగ్గురు స్నేహితులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తేని జిల్లా గూడలూరు ఆచ్చారిమార్ వీధికి చెందిన లింగేష్(24), సేవక్(23), సంజయ్(22), మోనీష్ (22), కేశవన్ (22) చిన్ననాటి నుంచి స్నేహితులు. ఈ ఐదుగురు మిత్రులు రెండు బైకులపై గురువారం సాయంత్రం మద్యం తాగేందుకు కంభం ప్రాంతానికి వెళ్లారు. కంభంలో మద్యం తాగిన తర్వాత ముగ్గురు ఓ బైకుపై, ఇద్దరు మరొక బైకుపై స్వస్థలానికి పయనమయ్యారు. తాగిన మైకంలో రోడ్డులో వీలింగ్ చేస్తూ రెండు బైకులను అత్యంత వేగంగా నడిపారు. కంభం - గూడలూరు జాతీయ రహదారిలో సుజనగిరి మఠం సమీపంలో రెండు బైకులు అదుపుతప్పి పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లింగేష్, సేవక్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని స్థానికులు అంబులెన్స్‌ను రప్పించి ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో సంజయ్ ప్రాణాలు కోల్పోయాడు. తక్కిన ఇరువురు కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఈ సంఘటనపై గూడలూరు నార్త్ ఎస్ఐ వనితామణి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

అమరజీవి స్మారక భవన నిధుల కోసం కృషి

● ఏపీ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిధుల కోసం ఏపీ ప్రభుత్వంతో చర్చించి, తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షతో సాధించిన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినం సందర్భంగా శుక్రవారం స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైలాపూర్‌లోని స్మారక భవనంలో ఉదయం 10 గంటలకు అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ సభకు కమిటీ కార్యదర్శి, కోశాధికారి ఒంటెల కృష్ణారావు సారథ్యం వహించగా, అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నూకసాని బాలాజి, ప్రత్యేక అతిథిగా తమిళనాడు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.శేఖర్, విశిష్ట అతిథులు కెన్సెస్ గ్రూప్ సీఈఓ ముత్తినేని కృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగంటి ఎరుకలయ్య, కమిటీ సభ్యులు అమరజీవి విగ్రహానికి పూలదండలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలాజి మాట్లాడుతూ... అభివృద్ధికి మారుపేరు ఏపీ సీఎం చంద్రబాబు అని, ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేతగానితనం వల్ల అభివృద్ధిలో కుంటుపడిన రాష్ట్రాన్ని మళ్లీ గట్టెక్కించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. రాజకీయ కక్షలతో కాకుండా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు గొప్పగా ఉండాలన్న ధృక్పథంతో అన్ని శాఖలు అగ్రస్థానంలో ఉండేలా ముందుకు తీసుకెళుతున్నారన్నారు. దేశ చరిత్రలో అత్యంత త్యాగధనుడు పొట్టి శ్రీరాములు అని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చెన్నైలో 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి తన జీవితాన్ని తర్పణం చేసిన మహనీయుడని కీర్తించారు. ఆయన ఆదర్శాలు, త్యాగనిరతిని అందిపుచ్చుకున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మైలాపూర్‌లో శిథిలావస్థలో ఉన్న అమరజీవి స్మారక భవనానికి 2017లో రూ.5 లక్షలతో మరమ్మతులు చేయించారని, రాబోయే రోజుల్లో కూడా ఈ భవన అభివృద్ధికి సాయం చేస్తారన్నారు. అనంతరం రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్.శేఖర్ మాట్లాడుతూ... భావితరాలకు అమరజీవి జీవిత చరిత్రను తెలియజేసే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ముత్తినేని కృష్ణ మాట్లాడుతూ... త్యాగానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు అని, తెలుగు వారు ఎక్కడున్నా ఆయన్ని స్మరించుకోవాలన్నారు. ఏనుగంటి ఎరుకలయ్య మాట్లాడుతూ... తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న పట్టుదలతో తన గురించి ఆలోచించకుండా ఆమరణ దీక్ష చేపట్టి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు ఆశయాన్ని నెరవేర్చేలా నిర్వాహక కమిటీ కృషి చేయాలన్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ ఆంజనేయులు సభా నిర్వాహకురాలిగా వ్యవహరించగా, సభ్యులు జేఎం నాయుడు వందన సమర్పణ చేశారు. సభ్యులు డాక్టర్ ఎంవీ నారాయణ గుప్తా, గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఏవీ శివకుమారి, ఎస్కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన వినోద కార్యక్రమం అలరించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను కమిటీ తరపున అందజేశారు.



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు





ఓ ఇంటి వద్ద ప్రవహిస్తున్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న పీడీఓ ఇతర అధికారులు - కుండపోత వర్షానికి కూలిన ఇంటి గోడ

తిరుప్పూరులో వర్ష బీభత్సం

● ఇళ్లలోకి చేరిన జలాలు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బనియన్ల తయారీ నగరం తిరుప్పూరులో శుక్రవారం వేకువ జామున కురిసిన కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించింది. వర్షపు



ఇంట్లో మురుగునీటిని తొలగిస్తున్న యజమాని

నీరంతా అడుగులోతున రహదారుల్లోనూ, ఇళ్లలోకి చేరి ప్రజలను ఇబ్బంది పెట్టింది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఈ వర్షానికి తిరుప్పూరు గాంగేయం పాళయం, ఏటీ కాలనీకి చెందిన కార్మికుడు కుమార్‌కు చెందిన ఇంటి గోడ కూలింది. ఆ ఇంట్లో కుమార్, ఆయన భార్య శశికళ, కుమారుడు కిషోర్, కుమార్తె కీర్తన నిదుపోతుండగా వేకువజామున ఆ గోడ కూలిపడింది. దీంతో శిథిలాల మధ్య చిక్కుకుని నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారి కేకలు విని చుట్టుపక్కల వారి అక్కడికి చేరుకుని శిథిలాల మధ్య ఉన్నవారిని వెలికితీశారు. ఆ తర్వాత నలుగురిని తిరుప్పూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

40 ఇళ్లలోకి వర్షపునీరు..

కుండపోత వర్షానికి తిరుప్పూరు మంగళం రోడ్డు, కేవీఆర్ నగర్, తంథైపెరియార్ నగర్ తదితర లోతట్టు ప్రాంతాల్లోని 40కి పైగా ఇళ్లలోకి వర్షపునీటితోపాటు, మురుగు చేరింది. కొందరి ఇళ్లలో బీరువాలు, మంచాలు మునిగాయి. కిరాణా సరుకులు కొట్టుకుపోయాయి. ఇళ్లలో చేరిని నీటిని స్థానికులే తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. కౌన్సిలర్ అన్బగం తిరుప్పతి ఇతర అధికారులు వర్ష బాధిత ప్రాంతాల్లో పర్యటించి వాన నీటి తొలగింపు పనులను చేపట్టారు. జల దిగ్బంధంలో చిక్కుకున్నవారికి అల్పాహారం, కిరాణా సరకులు పంపిణీ చేశారు. కోయంబత్తూరు, తిరుప్పూరు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నొయ్యల్‌వాగులో ఉధృతంగా ప్రవహించడంతో అదనపు జలాలు నివాస ప్రాంతాల్లోకి చొరబడ్డాయి.

బంగాళాఖాతంలో అల్పపీడనం

● రాష్ట్రానికి 7 నుంచి భారీ వర్ష సూచన

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల మొదటివారంలో అల్పపీడనం ఏర్పడుతుందని, ఈనెల 7న అది అల్పవాయుపీడనంగా మారే అవకాశం ఉందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం కారణంగా ఈ నెల 7 నుంచి రాష్ట్రంలో పలు చోట్ల మోస్తరుగా, కుండపోతగా వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ దాకా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పవాయుపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రంలోనే తీరం దాటే అవకాశం ఉందని, ఈ కారణంగా సముద్రతీర జిల్లాల్లో చెదురుముదురుగా వర్షాలు కురుస్తాయన్నారు. ఇదిలా ఉండగా మన్నార్ జలసంధి ప్రాంతం వద్ద ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా శుక్రవారం కన్నియాకుమారి, తిరునల్వేలి జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. శనివారం నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, మదురై, విరుదునగర్, తేని, దిండుగల్, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల ఓ మోస్తరుగా వర్షాలు కురవనున్నాయి. చెన్నైకి సంబంధించి రానున్న 48 గంటలపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

6న అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

● 2026 అసెంబ్లీ ఎన్నికలు, సర్వసభ్య మండలి సమావేశంపై చర్చ



పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికలకు ఇప్పటినుంచే అన్ని పార్టీలు సమాయత్తమవుతున్నాయి. అధికార డీఎంకే 200 స్థానాల్లో కైవసం చేసుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని అడుగులు వేస్తుండగా, ప్రతిపక్ష అన్నాడీఎంకే కూడా అదే వేగంతో సన్నాహాలు మొదలుపెట్టింది. 234 నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించిన డీఎంకే అధిష్ఠానం తొలిదశ ఎన్నికల పనులకు నాంది పలికింది. తదుపరి చర్యల్లో భాగంగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి 234 నియోజకవర్గాల్లో పర్యటించేలా ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో, కొత్త పార్టీ ప్రారంభించి ఇటీవల తొలి మహానాడును విజయవంతంగా నిర్వహించిన నటుడు విజయ్ తదుపరి ప్రచారంపై సమాలోచనలు జరుపుతున్నారు. దీంతో, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి ఊపందుకుంది. డీఎంకే-అన్నాడీఎంకేలు తమ కూటమి పార్టీలతో 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నాయి.

పార్టీ నిర్వాహకులతో భేటీ

అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష అన్నాడీఎంకే సరికొత్త వ్యూహాలతో సిద్ధమవుతోంది. ముఖ్యంగా పార్టీ నిర్వాహకులను త్వరలో మార్చనున్నట్లు సమాచారం. అలాగే, ఏ ఏ పార్టీలతో కూటమి, ఎన్నికల ప్రచారం తదితరాలపై ఎడప్పాడి పళనిస్వామి పార్టీ ముఖ్య నేతలతో చర్చిస్తున్నారు. అనంతరం చేపట్టాల్సిన వ్యూహాలపై ఆయన జిల్లా కార్యదర్శులతో ఈనెల 6న (బుధవారం) సమావేశం కానున్నారు. ఈ విషయమై పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో స్థానిక రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఉదయం 10 గంటలకు జిల్లా కార్యదర్శుల సమావేశం జరగనుంది. ఈ సమావేశం జిల్లా కార్యదర్శులు, పొరుగు రాష్ట్రాల రాష్ట్ర కార్యదర్శులు తప్పక పాల్గొనాలని పేర్కొంది.

సభ్యులకు గుర్తింపుకార్డులు...

రాష్ట్రాన్ని అన్నాడీఎంకే 82 జిల్లాలుగా విభజించుకుంది. ఈ జిల్లా కార్యదర్శులందరూ ఈ నెల 6వ తేది సమావేశానికి హాజరుకానున్నారు. వీరితో పాటు రాష్ట్ర నిర్వాహకులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొననున్నారు. అన్నాడీఎంకే సభ్యులకు కొత్త గుర్తింపుకార్డులు అందిస్తున్నారు. ఈ పనులు పర్యవేక్షించేందుకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో పర్యవేక్షకుడిని పళనిస్వామి నియమించారు. సభ్యులు గుర్తింపుకార్డు అందించే ప్రక్రియ ఎంతమేరకు పూర్తయిందనే అంశం కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

సంస్థాగత ఎన్నికలు...

అన్నాడీఎంకే సభ్యులందరికీ గుర్తింపుకార్డులు అందించినట్లు సమావేశంలో తెలిపితే, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై ముందుకు వెళ్లనున్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగి చాలా కాలం అయినందున ఈ ఎన్నికలు నిర్వహించే అంశం కూడా చర్చకు రానుంది. అలాగే, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ విజయాలు సాధించి అధికారం చేపట్టాలంటే అందరూ సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో పళనిస్వామి పిలుపునివ్వనున్నారు. అలాగే, పార్టీ కార్యవర్గ సమావేశం, సర్వసభ్య మండలి ఏడాదికి ఒకసారి నిర్వహించాలనే నిబంధన ఉంది. కార్యవర్గ సమావేశం గతంలో నిర్వహించగా, సర్వసభ్య మండలి సమావేశం గత డిసెంబరులో నిర్వహించారు. ఈ ఏడాది ఇంకా నిర్వహించలేదు. ఈ సమావేశం డిసెంబరులో నిర్వహించే అంశాన్ని కూడా పళనిస్వామి జిల్లా కార్యదర్శులతో చర్చించనున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ పరాజయం అనంతరం తొలిసారిగా జిల్లా కార్యదర్శుల సమావేశం జరగనుంది. అందువల్ల సమావేశంలో తీసుకొనే నిర్ణయాలపై పార్టీ కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

టాప్ గేర్‌లో దీపావళి విక్రయాలు

రూ.31 వేల కోట్లకు వ్యాపారం! - రెట్టింపు సంతోషంలో వ్యాపారులు



అడయార్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దీపావళి సంబరాలు ఆకాశాన్ని తాకాయి. ఈ పండుగను పురస్కరించుకుని వస్త్రాలు, మద్యం, మాంసం విక్రయాలు దుమ్మురేపాయి. పండుగ సందర్భంగా ఏకంగా రూ.31 వేల కోట్ల లావాదేవీలు జరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు సంతోషపడుతున్నారు. సాధారణంగా దీపావళి రోజున వర్షం కురుస్తుందనే నమ్మకం ఉంది. కానీ, ఈ దఫా పండుగకు ముందు రెండు మూడు రోజులుగా ఎలాంటి వర్షం కురవలేదు. ముఖ్యంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క చుక్క కూడా పడలేదు. దీంతో ప్రజలు తమకు ఇష్టమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు అవకాశం కలిగింది. దీపావళి పండుగకు కేవలం బాణసంచా మాత్రమేకాకుండా, జౌళి వ్యాపారం, మద్యం, మాంసం విక్రయాలు తారస్థాయిలో జరిగింది. ఈ టపాకాయల విక్రయవాలపై శివకాశికి చెందిన పలువురు బాణసంచా వ్యాపారులు మాట్లాడుతూ... గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా టపాకాయల విక్రయాలు మందకొడిగానే సాగాయనీ, దీంతో బాణసంచా తయారీదారులు నిరుత్సాహంలో కూరుకుని పోవడమే కాకుండా, నష్టాలను కూడా చవిచూశారన్నారు. అయితే, ఈ యేడాది దీపావళి పండుగ రోజున వర్షం కురవక పోవడంతో పది రోజులుగా మందకొడిగా సాగిన టపాకాయల విక్రయాలు ఒక్కసారిగా, తారస్థాయిలో జరిగాయన్నారు. రాష్ట్ర ప్రజలు భారీగా టపాకాయలను కొనుగోలు చేశారన్నారు. రాజధాని నగరం చెన్నైతో పాటు మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు, నెల్లై, సేలం, పుదుక్కోట, ఈరోడ్, విల్లుపురం, కడలూరు, సేలం, వేలూరు, నెల్లై తదితర జిల్లాల్లో కూడా ఊహించినదానికంటే బాణసంచా విక్రయాలు జరిగాయన్నారు. అలాగే, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా ఆర్డర్లు వచ్చాయన్నారు. తమిళనాడులోనే ఆరు వేల కోట్ల రూపాయలకు టపాకాయల విక్రయాలు జరిగి ఉంటాయని అంచనా వేసినట్టు తెలిపారు. బాణసంచా తరహాలోనే దుస్తుల వ్యాపారం జోరుగా సాగింది. దీపావళి పండుగకు చివరి నిమిషంలో అనేక మంది షాపింగ్ కోసం భారీగా ఖర్చు చేయడంతో ఈ విక్రయాలు రికార్డు స్థాయిలో జరిగినట్టు వెల్లడించారు. ఇదే విషయంపై వస్త్ర వ్యాపారులు మాట్లాడుతూ, గత యేడాదితో పోల్చితే ఈ యేడాది దీపావళి పండుగకు జౌళి వ్యాపారం జోరుగా జరిగిందన్నారు. చివరి నిమిషంలో కోట్లాది రూపాయలకు వ్యాపారం జరిగిందని వారు వెల్లడించారు. అలాగే, మాంసం విక్రయాలు కూడా భారీగానే జరిగాయి. దీపావళి పండుగ రోజున వేటమాంసం కిలో ధర రూ.1000 నుంచి రూ.1100 వరకు పలికింది. పండుగ రోజు ముందు ఈ ధర రూ.రూ.900 నుంచి రూ.940గా ఉండేది. అలాగే, కోడిమాంసం కూడా రూ.200 నుంచి రూ.240 వరకు పలికింది. రాష్ట్రంలోని పొట్టేళ్ల, మేకపోతుల విక్రయ సంతలో వ్యాపారం రూ.5 వేల కోట్లకుపైగా జరిగి ఉంటుందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

15 వేల మెట్రిక్ టన్నుల టపాకాయల చెత్త తొలగింపు



నగరంలో టపాకాయల చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో దీపావళి సందర్భంగా 30వేలకు పైగా ఉన్న వీధుల్లో సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల బాణసంచా చెత్తాచెదారాన్ని కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు తొలగించారు. చెన్నైలో గురువారం రాత్రి దీపావళి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆ సందర్భంగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 15 జోన్లలోనూ సాయంత్రం 6గంటల నుంచి నగరవాసులు టపాకాయలు కాల్చారు. రాయపురం, ప్యారీస్ కార్నర్, షావుకారుపేట, రాయపేట, మైలాపూరు, ట్రిప్లికేన్, చింతాద్రిపేట, అమింజికరై, మధురవాయల్, కోయంబేడు, తాంబరం, ఆవడి, అంబత్తూరు తదితర ప్రాంతాల్లో హండ్రెడ్‌వాలా, థౌజెంట్‌వాలా టపాకాయలంటూ నగరవాసులు పోటీపడి పేల్చారు. షావుకారుపేట వద్ద నిర్దేశిత సమయాన్ని మించి బాణసంచా పేల్చారు. ముఖ్యంగా వేల సంఖ్యలో తారాజువ్వలను కాల్చి సందడి చేశారు. నగరంలో 34 వేలకు పైగా వీధులున్నాయి. ప్రతివీధిలోనూ బాణసంచా చెత్తాచెదారం పేరుకుపోవటంతో శుక్రవారం వేకువజాము నుంచే కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు తొలగింపు పనుల్లో పాల్గొన్నారు. సుమారు ఐదువేల మంది కార్మికులు బ్యాటరీ వాహనాలతో చెత్తాచెదారాన్ని తొలగించారు. నగరంలో రోజూ 5500 మెట్రిక్ టన్నుల చెత్తను ఇళ్లనుంచి సేకరిస్తుంటారు. ఈ రోజువారీ చెత్తచెదారంతో పాటు దీపావళి వల్ల నగరమంతటా పేరుకుపోయిన 10 వేల మెట్రిక్ టన్నుల బాణసంచా చెత్తను కూడా కార్మికులు తొలగించినట్లు కార్పొరేషన్ ఉన్నతాధికారులు తెలిపారు.

దుర్గాస్టాలిన్‌కు శృంగేరిమఠం స్వామి ఆశీస్సులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం స్టాలిన్ సతీమణి దుర్గాస్టాలిన్ గురువారం రాత్రి శృంగేరి శారదాపీఠం సన్నిధానం విధుశేఖర భారతిస్వామి ఆశీస్సులందుకున్నారు. శారదాపీఠం మహాసన్నిధానం భారతి తీర్థస్వామి సన్యాస దీక్ష స్వర్ణోత్సవాల్లో భాగంగా విదుశేఖర భారతస్వామి నగరంలో విజయయాత్రను నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం మైలాపూరు డాక్టర్ రాధాకృష్ణన్ రోడ్డులోని సుధర్మగృహం వద్ద స్వామీ బసచేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం సహస్ర చండీయాగం నిర్వహించారు. ఈవేడుకల్లో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామినాథన్ బృందం భజనపాటలు ఆలపించింది. ఈ కార్యక్రమానికి దుర్గాస్టాలిన్ హాజరై స్వామీ ఆశీస్సులందుకున్నారు. సుమారు పావుగంట సేపు ఆమె ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల శిబిరం ప్రారంభం



సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అందించే శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. స్థానిక మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... దేశంలోనే ఎక్కువ మంది సైనికులు ఉన్న జిల్లాగా వేలూరు పేరుగాంచిందన్నారు. జిల్లాలో సుమారు 30 వేల మంది సైనికులున్నారని తెలిపారు. దేశ భద్రత కోసం అంకితమైన మాజీ సైనికులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో చెన్నై ఉప భద్రతా అకౌంట్స్ కంట్రోలర్ దిలీప్‌కుమార్, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, మాజీ సైనికులు పాల్గొన్నారు.

విధులు నిర్వహిస్తూ ఐబీ ఇన్‌స్పెక్టర్ మృతి

అడయార్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయంలో కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తూ అపస్మారక స్థితిలోకి జారుకుని మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నై ఎయిర్‌పోర్టులో ఐబీ ఇన్‌స్పెక్టరుగా మురేగశన్ పని చేస్తున్నారు. ఆయన గురువారం రాత్రి 9 గంటల సమయంలో టెర్మినల్ 1 ప్రాంతంలో నడుచుకుంటూ వెళుతుండగా ఉన్నట్టుండి కిందపడి స్పృహకోల్పోయాడు. గమనించిన సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, ఆయనను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు వెల్లడించారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు... మురుగేశన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామాకు తరలించారు. దీనిపై కేసునమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

డీఎంకే కౌన్సిలర్లకు దీపావళి బహుమతులు



కౌన్సిలర్‌కు బహుమతి అందజేస్తున్న ఆర్పీ రమేష్

వేలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కార్పొరేషన్‌లో 60 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో డీఎంకేకు చెందిన 40 మందికి సత్తువాచ్చేరి డీఎంకే ప్రాంత సెక్రటరీ ఆర్పీ రమేష్ దీపావళి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్ట్



గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితులు

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా అరన్‌తాంగిలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి నుంచి 150 కిలోల గంజాయి, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. అరన్‌తాంగి సమీపంలోని కరుంబైమేడు జంక్షన్ వద్ద గురువారం తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు, అటుగా వచ్చిన కారును అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. అందులో 150 కిలోల గంజాయి గుర్తించి కారు సహా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని విచారించగా... ఆంధ్ర రాష్ట్రం నుంచి గంజాయి తరలించి శ్రీలంకకు తరలిస్తున్నట్టు తేలింది. నిందితులను నాగరాజ్, తవమురుగన్, స్టాలిన్‌గా గుర్తించారు.

చెన్నై-థాయ్‌ల్యాండ్ విమాన సేవలు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి థాయ్‌ల్యాండ్‌లోని ఫుకెట్ నగరానికి నేరుగా విమానసేవలు ప్రారంభమయ్యాయి. నగరం నుంచి బుధ, శుక్ర, ఆదివారాలు అని మూడు రోజులు ఫుకెట్‌కు ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. అలాగే, నగరం నుంచి ఆఫ్రికాలోని అడిస్ అబాబాకు వారానికి నాలుగు రోజులు, నగరం నుంచి వడోదరకు వారానికి ఒక విమాన సేవలు ప్రారంభించినట్లు ఇండిగో సంస్థ తెలిపింది.

గబ్బిలాల కోసం టపాసులు కాల్చని గ్రామం

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా అమ్మాపేటలో సంచరిస్తున్న గబ్బిలాల సంరక్షణ కోసం దీపావళి సందర్భంగా టపాసులు కాల్చకుండా గ్రామస్తులు పండుగ జరుపుకున్నారు. అమ్మాపేటలో ఉన్న అయ్యాస్వామి గ్రీన్ పార్క్‌లో వేల సంఖ్యలో గబ్బిలాలు నివసిస్తున్నాయి. వాటిని సంరక్షించాలన్న లక్ష్యంతో అమ్మాపేట కార్పొరేషన్ జోనల్ కమిటీ చైర్మన్ ధనశేఖరన్, కౌన్సిలర్లు పారిశుధ్య కార్మికులతో కలసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. సుమారు 5 వేల కుటుంబాలకు వాట్సాప్ ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని, గబ్బిలాలు, ఇతర పక్షులు, పశువులకు హాని కలుగకుండా టపాసులు మోతలేని దీపావళి జరుపుకోవాలని మెసేజ్‌లు పంపించారు. అదే విధంగా గురువారం టపాసులు కాల్చకుండా దీపావళి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. అదే విధంగా వేలూరు జిల్లా గుడియాత్తం మున్సిపాలిటీ పరిధిలోని కామాక్షి అమ్మన్‌పేట ప్రజలు కూడా ఆ ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్న గబ్బిలాల కోసం టపాసులు కాల్చకుండా పండుగ జరుపుకోవడం విశేషం.

శ్రీలంక చెరనుంచి ఐదుగురు జాలర్ల విడుదల



చెన్నై విమానాశ్రయం చేరుకున్న జాలర్లు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం నిర్బంధించిన ఐదుగురు తమిళ జాలర్లు గురువారం రాత్రి విమానంలో చెన్నైకి తిరిగొచ్చారు. పుదుకోట్టై జిల్లా కోట్టైపట్టినం చేపలరేవు నుంచి కలైవానన్‌కు చెందిన మరపడవలో చేపలు పట్టేందుకు వెళ్ళి రమేష్, జానకి రామన్, కృష్ణన్, కుమార్, రమేష్, రాజ్‌ను అక్టోబర్ 9వ తేది వేకువజాము శ్రీలంక నావికాదళం సభ్యులు దాడి జరిపి నిర్బంధించారు. శ్రీలంక కోర్టు మరపడవను నడిపిన జాలరి రమేష్‌కు రూ.11.5లక్షల జరిమానా విధించింది. తక్కిన ఐదుగురు జాలర్లు మళ్ళీ శ్రీలంక సముద్ర జలాల్లోకి చొరబడమనే హామీని రాతపూర్వకంగా తీసుకుని విడుదల చేసింది. ఆ ఐదుగురు జాలర్లు శ్రీలంక నుంచి విమానంలో గురువారం రాత్రి చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనంలో ఈ ఐదుగురు జాలర్లు పయనమై శుక్రవారం వేకువజాము స్వస్థలాలకు చేరుకున్నారు.

రైలు నుంచి జారి పడి ఎస్ఐ మృతి



ఎస్ఐ సెంథిల్‌కుమార్

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి రైల్వే జంక్షన్‌లో రైలు నుంచి జారిపడి ఎస్ఐ దుర్మరణం చెందారు. చెన్నై అన్నానగర్ క్రైం విభాగంలో స్పెషల్ ఎస్ఐగా టి.సెంథిల్‌కుమార్ పని చేస్తున్నారు. గురువారం ఆయన తిరుప్పూరు నుంచి చెన్నైకి బయలుదేరారు. శుక్రవారం ఉదయం వేలూరు జిల్లా కాట్పాడి రైల్వే జంక్షన్ చేరుకున్న సెంథిల్‌కుమార్ కదులుతున్న మంగళూరు - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ప్రయత్నించి జారిపడి తీవ్రగాయాలతో ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. కాట్పాడి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాలతో వైగై నదిని పర్యవేక్షించాలి

● మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల ప్రజల తాగునీటి కొరతను పూర్తి చేస్తున్న వైగై నదిని పరిశుభ్రంగా ఉంచేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాల్సిందిగా మదురై కార్పొరేషన్, జిల్లా యంత్రాంగానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మదురై జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ఆదనూరు డ్యాం పూర్తిస్థాయిలో నిండిందని, ఈ నీటిని వ్యవసాయానికి సరఫరా చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. శుక్రవారం జరిగిన విచారణకు హాజరైన పిటిషనర్, ప్రభుత్వ తరఫు న్యాయవాదులనుద్దేశించి న్యాయస్థానం పలు ప్రశ్నలు అడిగింది. తాగునీటి కోసం ఉపయోగపడే వైగై నది నీటిని కలుషితం కాకుండా శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించింది. నది తీర ప్రాంతాల్లో చెత్త వేయడాన్ని అడ్డుకోవడంతో పాటు వాహనాలు శుభ్రం చేయడాన్ని నిషేధించాలని, ఈ చర్యలను పర్యవేక్షించేలా పరీవాహక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

పట్టాల మధ్య బండరాళ్లు

● పొదిగై ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

అడయార్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలో పొదిగై ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రమాదం వాటిల్లే లాగా రైలు పట్టాల మధ్యలో బండరాళ్లు పెట్టిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అయితే లోకో పైలెట్ సమయస్ఫూర్తితో ఈ పెను ప్రమాదం తప్పింది. చెన్నై ఎగ్మోర్ నుంచి గురువారం సాయంత్రం 6.25 గంటలకు పొదిగై ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. ఈ రైలు కడయనల్లూరు స్టేషన్ దాటిన తర్వాత పొగనల్లూరు సమీపంలో వెళుతుండగా రైలు పట్టాల మధ్య బండరాళ్ళు పెట్టివుండటాన్ని లోకోపైలెట్ గుర్తించి, రైలు వేగాన్ని తగ్గించి ముందుకు వెళ్ళారు. దీంతో రైలుకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. అయితే, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. తిరునెల్వేలి డీఎస్పీ ఇళంగోవన్ సారథ్యంలో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైలు పట్టాల మధ్యలో పెట్టిన బండరాళ్లను తొలగించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నంబి ఆలయానికి భక్తుల అనుమతి

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కళక్కాడు సమీపం తిరుక్కురుంగుడి పశ్చిమ కనుమల్లో అటవీ ఏనుగులు మకాం వేయడంతో ఆ ప్రాంతంలో ఉన్న నంబి ఆలయానికి భక్తులు వెళ్లేందుకు నిషేధించారు. ఈ నేపథ్యంలో, ఏనుగుల మంద మరో ప్రాంతానికి వెళ్లడంతో గురువారం నుంచి నంబి ఆలయానికి భక్తులను అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది.

సమాచార దర్శిని

రూ.61.50 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, నవంబరు 1: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.61.50కి పెరిగింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా ప్రతినెలా సిలిండర్ ధరల్లో మార్పు లుంటాయి. గత నెల 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.1855 ఉండగా, రూ.61.50 పెరగడంతో రూ.1,964.50కు విక్రయమవుతోంది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేకుండా రూ.818.50కి విక్రయమవుతోంది.

కుట్రాలం జలపాతంలో స్నానాలకు నిషేధం

పెరంబూర్, నవంబరు 1: కుట్రాలం జలపాతంలో పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. తెన్‌కాశి జిల్లాల్లో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కుట్రాలం జలపాతాల్లో నీటి ఉధృతి అధికంగా ఉండడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతాల వద్ద స్నానాలను నిషేధించారు. నీటి ఉధృతి తగ్గడంతో గత నెల 27వ తేది నుంచి పర్యాటకులను అనుమతించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో, జిల్లాల్లో మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో జలపాతాల వద్ద వరద ఉధృతి అధికమైంది. ఈ కారణంగా ప్రధాన, పాత జలపాతాలు, అయిందరువి తదితర అన్ని జలపాతాల్లో గురువారం పర్యాటను నిషేధించారు. దీంతో, దీపావళి సెలవులు కావడంతో జలపాతాల వద్దకు వచ్చిన పర్యాటకులు నిరాశగా వెనుదిరిగారు.

రూ.22 కోట్లతో చెంబరంబాక్కం జలాశయ మరమ్మతులు

పెరంబూర్, నవంబరు 1: చెంబరంబాక్కం జలాశయాన్ని రూ.22 కోట్లతో మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. చెన్నైవాసులకు తాగునీరందించే జలాశయాల్లో ఒకటైన చెంబరంబాక్కం 6,300 ఎకరాల్లో 3,645 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగింది. మిచౌంగ్ తుఫాను, తదనంతరం చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో చెంబరంబాక్కం జలాశయానికి భారీస్థాయిలో నీరు చేరింది. దీంతో గట్టు దెబ్బతిని సమీపంలోని గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. ఈ నేపథ్యంలో గట్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.22 కోట్లు విడుదల చేసిందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నేటినుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, నవంబరు 1: దీపావళి పండుగ ముగించుకొని స్వగ్రామాల నుంచి తిరిగొచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. 2 నుంచి 4వ తేది వరకు మూడు రోజుల్లో 12,848 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. పలు నగరాల నుంచి చెన్నైకి 2,692 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. పండుగ ముగించుకొని చెన్నైకి తిరిగొచ్చేందుకు ప్రభుత్వ బస్సుల్లో 1.50 లక్షల మంది రిజర్వేషన్ చేయించుకున్నారని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

చెన్నైకి తిరిగొచ్చే ప్రజల కోసం ప్రత్యేక రైళ్లు

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ జరుపుకొనేందుకు సొంతూళ్లకు వెళ్లి నగరానికి తిరిగొచ్చే ప్రజల కోసం నగర శివారు ప్రాంతాలైన కాట్టాన్‌కొళత్తూర్ నుంచి తాంబరం మధ్య ఈ నెల 4వ తేది ప్రత్యేక విద్యుత్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే శాఖ ప్రకటించింది. నగరంలో వృత్తిరీత్యా నివసిస్తున్న సుమారు 10 లక్షల మందికి పైగా ప్రజలు ఆదివారం వరకు నాలుగు రోజులు వరుస సెలవులు కావడంతో దీపావళి జరుపుకొనేందుకు సొంతూళ్లకు వెళ్లారు. కాటాన్‌కొళత్తూర్ - తాంబరం మధ్య ఈ నెల 4వ తేది ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. తెల్లవారుజామున 4.30, 5.00, 5.45, ఉదయం 6.20 గంటలకు కాట్టాన్‌కొళత్తూర్ నుంచి బయల్దేరే ప్రత్యేక రైళ్లు పొత్తేరి, గుడువాంజేరి, ఊరపాక్కం, వండలూరు, పెరుంగళత్తూర్ మీదుగా వెళ్లనున్నాయి. అలాగే, తాంబరం నుంచి ఉదయం 5.05, 5.40 గంటలకు రెండు ప్రత్యేక రైళ్లు కాట్టాన్‌కొళత్తూర్ వరకు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

30వ తేదిలోపు వృద్ధాశ్రమాలు, వసతి గృహాల నమోదు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమాలు, మహిళలు, పిల్లల వసతి గృహాలు ఈనెల 30వ తేదిలోపు నమోదు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న వృద్ధాశ్రమాలు, వసతి గృహాలు చట్టప్రకారం నమోదు చేసుకోవాలి. ఆ ప్రకారం, ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాశ్రమాలు https://www.seniorcitize-homes.tnsocialwelfare.tn.gov.inలో, మహిళలు, పిల్లల వసతి గృహాలకు https://tnswp.comలో, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులు సమర్పించవచ్చు. పునరావాస గృహాలు https://thhealth.tn.gov.in/tngovin/dme.dme.php, కీల్పాక్కం మానసిక ఆస్పత్రి, మెంటల్లీ రిటార్డెడ్ హోం, దివ్యాంగుల ఆశ్రమాలకు జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

నేడు పరిమిత సంఖ్యలో సబర్బన్ రైళ్లు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాలకు ఈనెల 2న శనివారం తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు నడపనున్నారు. ప్రభుత్వ సెలవు దినం కావడంతో చెన్నై మూర్ మార్కెట్ - తిరువళ్లూర్, తిరుత్తణి, చెన్నై మూర్ మార్కెట్ - గుమ్మిడిపూండి - సూళ్లూరుపేట, చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు మార్గాల్లో నడిచే సబర్బన్ రైళ్లు, చెన్నై బీచ్ - వేళచ్చేరి మధ్య నడిచే ఎమ్మార్టీఎస్ రైళ్లు శనివారం రోజున ఆదివారం టైంటేబుల్ ప్రకారం నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

టపాసులు కాల్చడంలో గొడవ

● బాలుడి హత్య

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలో టపాసులు కాల్చడంలో స్నేహితుల మధ్య గొడవలో 17 ఏళ్ల బాలుడు హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన శంకర్ కుమారుడు శ్యామ్ (17) గురువారం రాత్రి దీపావళి పండుగ సందర్భంగా తన మిత్రులతో కలసి ఐస్‌హౌస్ పరిధిలోని చెల్లమ్మాళ్ గార్డెన్‌కు వెళ్లాడు. అప్పుడు టపాసులు కాల్చడంలో స్నేహితుల మధ్య వాగ్వాదం చివరకు ఘర్షణకు దారితీసింది. ఇందులో తీవ్రంగా గాయపడ్డ శ్యామ్‌ను మిత్రులు రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో మరణించాడు. ఈ హత్యకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

బాణసంచా పేలి ఇద్దరి మృతి

అడయార్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కళ్ళకురిచ్చి జిల్లా ఉళుందూరుపేట సమీపంలోని ఎరైయూర్ అనే ప్రాంతంలో బాణసంచా పేలి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. దీపావళి పండుగ కోసం టపాకాయలను కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా, అవి ఉన్నట్టుండి పేలిపోయాయి. ఈ ఘటనలో ఎరైయూర్‌కి చెందిన ప్రేమ్‌కుమార్ (24), పవుల్ రాజ్ (22), డేవిడ్ విన్సెంట్ (22) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఎరైయూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం సేలం, కళ్ళకురిచ్చి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తుండగా, డేవిడ్ విన్సెంట్, పవుల్ రాజ్ ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● ఆటో డ్రైవర్ అరెస్ట్

ప్యారీస్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి సమీపంలో విద్యార్థిని(14)పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆటో డ్రైవర్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని సాయంత్రం ఇంటికి తిరిగొస్తున్న సమయంలో దారి కాచి కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్ గోపినాథ్ (25) లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు, గోపినాథ్‌ను గురువారం అరెస్ట్ చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

10 జిల్లాల్లో అధికమైన డెంగ్యూ వ్యాప్తి

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల సీజన్ ప్రారంభం కావడంతో 'ఎడిస్' దోమల ఉత్పత్తి అధికమైంది. ప్రస్తుతం 10 జిల్లాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా ఉంది. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ... చెన్నై, చెంగల్పట్టు, కోయంబత్తూర్, కృష్ణగిరి, తిరుపత్తూర్, తేని, మదురై, తిరునల్వేలి, నామక్కల్, తంజావూరు జిల్లాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా ఉందన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 19,000 మంది డెంగ్యూ బారిన పడగా, ఏడుగురు మృతి చెందారని తెలిపారు. ప్రతిరోజు 75 నుంచి 100 మంది డెంగ్యూ లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్నారని తెలిపారు. బాధితులకు అవసరమైన మందులు, మాత్రలు నిల్వ ఉంచామని, ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లాలో పిడుగుపాటుకు మహిళ మృతి చెందింది. ముసిరి ప్రాంతానికి చెందిన ముత్తులక్ష్మి కావేరి నదిలో స్నానం చేసి తిరిగి వెళుతున్న సమయంలో హఠాత్తుగా పిడుగు పడింది. ఈ షాక్‌కు గురైన ముత్తులక్ష్మి ఘటనా స్థలంలోనే మృతిచెందింది.

నీట మునిగి....

సేలం జిల్లా ఎడప్పాడి సమీపం పూలాంబట్టికి విహార యాత్రకు వచ్చిన పర్యాటకుడు నీటమునిగి మృతిచెందాడు. కోవై పీలమేడుకు చెందిన ఏడుగురు విహార యాత్రకు వెళ్లారు. వారందరూ కావేరి నదిలో స్నానం చేస్తున్న సమయంలో బాబు (47) హఠాత్తుగా లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగాడు. స్నేహితుల కేకలతో అక్కడకు చేరకున్న చుట్టుపక్కల వారు నదిలో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు.

అగరం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నేటినుంచి స్కందషష్టి లక్షార్చన

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు సమీపం అగరం పాలవాయల్ రోడ్డులోని ప్రసన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈ నెల 2 నుంచి స్కందషష్టి లక్షార్చన వేడుకలు, తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 2 నుంచి 7 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు స్కందషష్టి లక్షార్చన జరుగుతుంది. 8వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు స్వామివారి తిరుకల్యాణోత్సవం జరుగుతుంది. మండప దీపారాధన, రాజోపచారం, షోడషోపచారం, మంత్రపుష్పం, వేదపారాయణం, పంచపురాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి ఊంజల్ సేవ, రాత్రి 7.30 అన్నదానం ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్ర జీఎస్‌టీ ఆదాయం రూ.11,188 కోట్లు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్టోబరు నెల జీఎస్‌టీ ఆదాయం రూ.11,188 కోట్లు సమకూరింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... దేశవ్యాప్తంగా అక్టోబరు జీఎస్‌టీ వసూళ్లు రూ.1.87 లక్షల కోట్లకు చేరింది. సెప్టెంబరులో రూ.1.72 లక్షల కోట్లు కాగా, అక్టోబరులో 8.9 శాతం అదనంగా వసూళ్లు జరిగాయి. అదే సమయంలో రాష్ట్రంలో సెప్టెంబరులో రూ.10,761 కోట్ల జీఎస్‌టీ వసూళ్లుకాగా, అక్టోబరులో 4 శాతం పెరిగి రూ.11,188 కోట్లు వసూలైంది. అలాగే, కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో అక్టోబరు జీఎస్‌టీ వసూళ్లు రూ.252 కోట్లు అని, సెప్టెంబరుతో పోల్చితే 19 శాతం అధికమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

మద్యం మత్తులో చెన్నై కాలేజీ విద్యార్థి హత్య

● బాలుడి సహా ముగ్గురి అరెస్టు



పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సత్యవేడు సమీపం దాసుకుప్పం వద్ద మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన తగాదాలో చెన్నై వ్యాసర్పాడి అంబేడ్కర్ కాలేజీ విద్యార్థి హత్యకు గురయ్యాడు. పోలీసుల తెలిపిన వివరాలిలు ఇలా వున్నాయి... తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట రెడ్డి వీధిలో నివసిస్తున్న తాపీ మేస్త్రీ ధనశేఖర్ కుమారుడు దినేష్ (19) అంబేద్కర్ కాలేజీలో బీఏ (తమిళం) ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఆగస్టు 20న కాలేజీకి వెళ్లిన దినేష్ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు అన్ని చోట్లా వెతికినా అతడి జాడ తెలియలేదు. దీంతో ఊత్తుకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఊత్తుకోట రెడ్డి వీధిలోనే నివసిస్తున్న కార్తిక్ (24), కామరాజ్ వీధికి చెందిన నాగా(22), బాలుడితో దినేష్ తిరుగుతుండేవారని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. రెండు రోజులకు ముందు ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా దినేష్‌ను మద్యం మత్తులో హతమార్చి దాసుకుప్పం వద్ద నున్న చెరువుగట్టు వద్ద పూడ్చిపెట్టినట్లు వెల్లడైంది. వెంటనే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం సత్యవేడు తహసీల్దార్ సుబ్రమణి సమక్షంలో తిరువళ్లూరు మెడికల్ కాలేజీ ఆస్పత్రి వైద్యుడు శరవణకుమార్ నేతృత్వంలో దినేష్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న కామేష్ మరో కేసులో అరెస్టయి పుళల్ సెంట్రల్ జైలులో ఉన్నాడని ఊత్తుకోట పోలీసులు తెలిపారు.

విజయ్‌కి రజనీ శుభాకాంక్షలు



కోలీవుడ్ అగ్రహీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగంపై సూపర్‌స్టార్ రజనీకాంత్ ఎట్టకేలకు స్పందించారు. విజయ్ తన సొంత పార్టీ టీవీకే తొలి మహానాడును విజయవంతంగా నిర్వహించారని, ఆయనకు తన అభినందనలు అంటూ వ్యాఖ్యానించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని తన నివాసానికి వచ్చిన అభిమానులకు రజనీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. పోయెస్ గార్డెన్‌లోని తన నివాసం నుంచి వెలుపలికి వచ్చిన రజనీకాంత్.. ఇంటి ముందు గుమికూడిన అభిమానులుకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు. ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నా. విజయ్ విజయవంతంగా టీవీకే మహానాడును నిర్వహించారు. ఆయనకు నా శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

'అమరన్' బృందానికి సీఎం స్టాలిన్ ప్రశంసలు

● క్లైమాక్స్ సూపర్బ్ అంటూ కితాబు

చిత్రజ్యోతి



చిత్ర బృందంతో సీఎం, డిప్యూటీ సీఎం

దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి - హీరో శివకార్తికేయన్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుని దీపావళి పండుగ సందర్భంగా విడుదలైన 'అమరన్' చిత్రాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వీక్షించారు. ఈ సినిమా విడుదలకు ఒక రోజు ముందుగానే నగరంలోని ఓ ప్రివ్యూ థియేటర్‌లో వారికోసం ప్రదర్శించారు. వీరితో పాటు హీరో శివకార్తికేయన్, హీరోయిన్ సాయిపల్లవి, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి, నిర్మాతల్లో ఒకరైన ఆర్.మహేంద్రన్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ కూడా ఈ సినిమాను చూశారు. ఆ తర్వాత ఈ చిత్ర బృందాన్ని సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రశంసల్లో ముంచెత్తారు. ఆ తర్వాత చిత్ర నిర్మాత, అగ్ర నటుడు కమల్ హాసన్‌కు సీఎం స్టాలిన్ స్వయంగా ఫోన్ చేసి అభినందించడంతో పాటు క్లైమాక్స్ కళ్ళు చెమర్చేలా ఉందని, తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాయని, సినిమా చాలా బాగుందని కితాబిచ్చారు. ఆ తర్వాత తన ట్విట్టర్ ఖాతాలోనూ ఆయన ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. 'స్నేహితుడు కమల్ ఆహ్వానం మేరకు 'అమరన్' చిత్రాన్ని వీక్షించాను. పుస్తకాల తరహాలోనే సినిమా రూపంలో నిజ జీవిత కథలను నేటి యువతరానికి చేరవేయడం ఎంతో సంతోషంగా ఉంది' అన్నారు. అలాగే, హీరో శివకార్తికేయన్ కూడా ప్రేక్షకులతో కలిసి నగరంలోని ఓ థియేటర్‌లో సినిమా చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి చిన్నారికి ఈ చిత్రాన్ని చూపించాలని కోరారు. సినిమాలను ప్రేక్షకులు అమితంగా ఆదరిస్తుండటం సంతోషంగా ఉందన్నారు.

ఆర్జే బాలాజీ హీరోగా 'హ్యాపీ ఎండింగ్'



దర్శక నటుడు ఆర్జే బాలాజీ కథానాయకుడిగా 'హ్యాపీ ఎండింగ్' పేరుతో చిత్రం తెరకెక్కనుంది. 'తంగలాన్' ఫేం పా.రంజిత్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన అమ్మా ముత్తు సూర్య ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. షాన్ రోల్డాన్ సంగీతం అందిస్తున్నారు. 'గుడ్‌నైట్', 'లవర్' వంటి పలు హిట్ చిత్రాలను నిర్మించిన మిలియన్ డాలర్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్‌ను దీపావళి పండుగ సందర్భంగా రిలీజ్ చేశారు. ఇందులో హోటల్‌లో కూర్చొని భోజనం చేస్తున్న ఆర్జే బాలాజీని ప్రేమానుభూతులను చెప్పాలని కోరగా, నూడుల్స్ తినే ఫోర్క్‌ను చేతిలో పట్టుకుని టేబుల్‌ను పొడుస్తాడు. కొద్దిసేపటి తర్వాత బ్రేకప్ చేసుకున్న కొందరు మహిళలు ఆర్జే బాలాజీపై దాడి చేస్తారు. ఈ సన్నివేశాలు తీవ్ర హింసతో పాటు రొమాన్స్, హాస్యభరితంగా ఉంది. పైగా టీజర్‌లోని ఏ ఒక్క డైలాగ్ డబుల్ మీనింగ్ లేదు. ఇదిలా వుండగా, ఆర్జే బాలాజీ అగ్రహీరో సూర్యను డైరెక్ట్ చేయనున్న విషయం తెల్సిందే. ఇది సూర్య నటించే 45వ చిత్రం కావడం గమనార్హం. 'సూర్య-45' ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే 'హ్యాపీ ఎండింగ్' ప్రాజెక్టును సెట్స్ పైకి తీసుకెళ్లనున్నారు.

ఆరేళ్ల తర్వాత దేవయాని ప్రధాన పాత్రలో కొత్త చిత్రం

1990 దశకంలో అగ్రహీరోయిన్‌గా రాణించిన హీరోయిన్ దేవయాని.. ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ ప్రధాన పాత్ర (కథానాయిక)లో నటించనున్నారు. ఈ మూవీకి 'నిళర్కుడై' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శివ ఆర్ముగం కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజిత్, కణ్మణి మనోహరన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. వీరితో పాటు ఇళవరసు, రాజ్‌కపూర్, మనోజ్ కుమార్, వడివుక్కరసి, కవితా రవి, అక్షర తదితరులు నటించారు. దర్శకుడు దర్షన్ వైవిధ్యభరితమైన పాత్రలో కనిపించనున్నారు. నేటి యువతరం విదేశీ వ్యామోహంతో తమ తల్లిదండ్రులు, పిల్లలు, వారి కుటుంబ సభ్యులను అనాథాశ్రమాల్లో వదిలిపెట్టి విదేశాలకు వెళుతున్నారు. అక్కడ వారు ఎదుర్కొనే సమస్యలను షాడో థ్రిల్లర్ తరహాలో రూపొందిస్తున్నారు. చెన్నైతో పాటు పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. కాగా, దేవయానికి సినిమా అవకాశాలు తగ్గిపోవడంతో టీవీ సీరియళ్లలో నటిస్తున్నారు. 2018లో వచ్చిన 'ఏళుమిన్'లో కథానాయికగా వివేక్ సరసన నటించిన దేవయాని.. ఇపుడు ఆరేళ్ల తర్వాత నిళర్కుడై' సినిమాలో ప్రధాన పాత్రను పోషిస్తున్నారు.





10,008 నెయ్యి దీపాలతో ప్రత్యేక పూజలు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నెయ్యి ప్రమిదలు

వేలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరియూరులో ఉన్న శ్రీపురం నారాయణి పీఠంలో ప్రజలు క్షేమంగా జీవించాలని, వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు కురిసి రైతులు క్షేమంగా ఉండాలని కోరుతూ గురువారం సాయంత్రం నారాయణి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, ఆరాధనలు నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా నక్షత్రం ఆకారంలో 10,008 నెయ్యి దీపాలు వెలిగించిన భక్తులు, ప్రత్యేక పూజుల్లో పాల్గొన్నారు. నారాయణి పీఠం స్థాపకుడు శక్తి అమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించి, నారాయణి అమ్మవారికి ఊంజల్ సేవ, నెయ్యి దీపాలకు మహా దీపారాధనలు చేశారు. కార్యక్రమలో నారాయణి పీఠం మేనేజర్ సంపత్, స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు, నారాయణి ట్రస్టీ సౌందరరాజన్, నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ బాలాజి, విదేశీ భక్తులు పాల్గొన్నారు.

9న రాజరాజచోళుడి జయంతి వేడుకలు

● బృహదీశ్వరాలయం వద్ద ముహూర్త స్తంభస్థాపన



శుభముహూర్త స్తంభస్థాపన చేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తంజావూరు బృహదీశ్వరాలయాన్ని నిర్మించిన చోళ చక్రవర్తి రాజరాజచోళుడి జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం ఆ ఆలయం వద్ద శుభముహూర్త స్తంభస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రాజరాజచోళుడి జన్మనక్షత్ర దినమైన ఐప్పసి మాసం, సదయం నక్షత్ర (ఆశ్వయుజ మాసం శతభిషం నక్షత్ర) దినాన సదయ ఉత్సవాల పేరిట జయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. గత యేడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఆ మేరకు ఈ యేడాది రాజరాజచోళుడి 1039వ సదయ వేడుకలు ఈ నెల 9, 10 తేదీల్లో అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ వేడుకలలో భాగంగా శుక్రవారం ఉదయం బృహదీశ్వరాయలం వద్ద శుభముహూర్త స్తంభస్థాపన కార్యక్రమం నిర్వహించారు. పందిటి గుంజకు పాలు, పసుపు, పెరుగు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత దీపారాధన గావించి పందిటి గుంజను నాటారు. ఈ కార్యక్రమంలో సదయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సెల్వం, ఉపాధ్యక్షుడు మెహతా, రాజమహల్ దేవస్థాన పారంపర్య ట్రస్టీ బాబాజీ రాజా భోంస్లే, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కవిత, కార్యనిర్వహణాధికారి మాదవన్, తమిళర్ వెట్రి పేరవై చెళియన్ తదితరులు పాల్గొన్నారు. సదయ నక్షత్ర దినమైన ఈ నెల 10న రాజరాజచోళుడి విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున భారీ పూల మాలలను సమర్పించి నివాళులర్పించనున్నారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ వేడుకల సందర్భంగా పట్టిమండ్రం, నృత్యనాటకాలు, తిరుముర్రై అరంగం, కరుత్తరంగం, కవియరంగం అంటూ వివిధ సాహితీ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదే సమయంలో పెరువుడయార్ (బృహదీశ్వరాలయ మహాలింగంకు)కు పెరియనాయకి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించనున్నారు.

కిక్కిరిసిన కన్నియాకుమారి



వివేకానంద స్మారక మండపాన్ని తిలకించేందుకు బారులు తీరిన పర్యాటకులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో శుక్రవారం పర్యాటకుల సందడి అధికమైంది. వరుస సెలవులు రావడంతో రాష్ట్రం సహా కేరళ నుంచి కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం వేకువజాము త్రివేణి సంగమం వద్ద సూర్యోదయ దృశ్యాన్ని వీక్షించేందుకు పర్యాటకులు గుమికూడారు. ఇక వివేకానంద స్మారక మండపాన్ని సందర్శించేందుకు పర్యాటకులు పూంపుహార్ బోట్ సవారీ కోసం బారులు తీరారు. బోట్ సవారీ ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని తెలిసినా 7 గంటల నుంచే క్యూలో నిలబడ్డారు. ఇదే విధంగా కన్నియాకుమారి భగవతి అమ్మన్ ఆలయం, సుసీంద్రం తానుమాలయన్ స్వామి ఆలయం, కొట్టారమ్ రామాలయం, తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయం, వివేకానంద కేంద్రం ప్రాంగణంలోని భారతమాత ఆలయం, రామాయణ దర్శన చిత్ర ప్రదర్శనకూడమ్, గాంధీ స్మారక మండపం, లైట్ హౌస్, అక్వేరియం, హార్టీకల్చర్ గార్డెన్, వట్టకోట్టై బీచ్ తదితర పర్యాటక ప్రాంతంలోనూ పర్యాటకుల సందడి ఉదయం నుంచే అధికమైంది.

ఏఎస్పీ వందితా పాండే సహా ఏడుగురికి హోంశాఖ అవార్డులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ యేడాది దర్యాప్తు విభాగంలో విశిష్ట సేవలందించిన రాష్ట్రానికి చెందిన ఏఎస్పీ వందితా పాండే సహా ఏడుగురికి అవార్డులను ప్రకటించింది. వందితా పాండేతోపాటు ఎం.అంబిక (ఇన్‌స్పెక్టర్), కే.మీనా (ఎస్పీ), ఎన్. ఉదయకుమార్ (ఇన్‌స్పెక్టర్), సి. కార్తీకేయన్ (ఏసీపీ), నల్లశివం (ఏసీపీ), ఎస్ బాలకృష్ణన్ (ఇన్‌స్పెక్టర్) ఈ అవార్డుకు ఎంపికైనట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇదే విధంగా ఫోరెన్సిక్ విభాగంలో పనిచేస్తున్న సురేష్ నందగోపాల్ (డిప్యూటీ డైరెక్టర్) కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. తొలుత ఈ అవార్డులను హోంమంత్రి అవార్డుల పేరుతో ప్రదానం చేసేవారు. ప్రస్తుతం కేంద్రీయ గృహ మంత్రి దక్షతా పతక్ అనే పేరుతో ప్రదానం చేయనున్నారు.



ఏఎస్పీ వందితా పాండే

ఊటీలో పర్యాటకుల రద్దీ

● రెండు రోజులు ప్రత్యేక కొండ రైళ్లు



కున్నూర్ రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులు

పెరంబూర్, నవంబరు 1: దీపావళి పండుగ సందర్భంగా నాలుగు రోజులు వరుస సెలవులు రావడంతో నీలగిరి జిల్లా ఊటీకి పర్యాటకుల రాక అధికమైంది. ఊటీకి వచ్చే పర్యాటకులు కొండ రైలులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపడంతో సాధారణంగా నడిపే రైళ్లు కిటకిటలాడుతున్నాయి. మేట్టుపాళయం నుంచి ఊటీకి వెళ్లే కొండ రైలు రిజర్వేషన్ ఫుల్ కాగా, ఊటీ-కున్నూర్ మధ్య నడిచే రైలులో ప్రయాణించడానికి పర్యాటకులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో, పర్యాటకుల సౌకర్యార్థం ఈనెల 2, 3 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కున్నూర్ నుంచి ఊటీకి ఉదయం 8.20, ఊటీ నుంచి కున్నూర్‌కు సాయంత్రం 4.45, ఊటీ నుంచి కెత్తికి 'రౌండ్ ట్రిప్ జాయ్ ట్రైన్' పేరుతో ఉదయం 9.40, 11.35, మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

కొడైకెనాల్‌కు పోటెత్తిన పర్యాటకులు



కొడైకెనాల్ సరస్సులో బోట్ సవారీ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌కు రెండు రోజులుగా పర్యాటకుల తాకిడి అధికమైంది. దీపావళి సెలవులకు తోడు వారాంతపు సెలవులు తోడవటంతో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటకల నుంచి కూడా వేల సంఖ్యలో తరలివస్తున్నారు. శుక్రవారం కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్కూళ్లు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో కొడైకెనాల్‌ను సందర్శించారు. దీంతో అక్కడి సందర్శనీయ స్థలాల వద్ద రద్దీ అధికమైంది. ట్యాంక్‌రోడ్డులో సైకిల్ సవారీ, స్టార్ కెనాల్ వద్ద బోట్ సవారీ కోసం పర్యాటకులు బారులు తీరారు. వారం రోజులకు ముందు కొడైకెనాల్ అంతటా చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. దీంతో పర్యాటకుల రాక తగ్గింది. ప్రస్తుతం వానలు తగ్గి తరచూ చిరుజల్లులు మాత్రమే పడుతుండడంతో అక్కడి వాతావరణం పర్యాటకులకు ఆహ్లాదకరంగా మారింది. ఇక శని, ఆదివారాల్లోనూ పర్యాటకుల రాక అధికమవుతుందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

కోతకు సిద్ధంగా కాఫీ గింజలు

పెరంబూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పందలూరు చుట్టుపక్కల ప్రాంతాలోని కాఫీ తోటల్లో గింజలు కోతకు సిద్ధమయ్యాయి. నీలగిరి జిల్లా పందలూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో, తేయాకు తర్వాత రైతులు కాఫీ అదిపెద్ద వ్యవసాయ రంగంగా ఉంది. ఈ ప్రాంతంలో రైతులు 'రొబొస్టా' అనే రకం కాఫీ సాగు చేపడుతుంటారు. అలాగే, తక్కువ మంది రైతులు అరబికా కాఫీని పండిస్తుంటారు. ప్రస్తుతం చెట్లకు కాఫీ గింజల దిగబడులు బాగా పెరిగి కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ విషయమై రైతు జోస్ మాట్లాడుతూ... టీ వ్యవసాయం రైతులకు లాభదాయకం కానప్పటికీ, కాఫీ సాగు తక్కువ ఖర్చు, సంవత్సరానికి ఒకసారి మంచి దిగుబడి ఇస్తుందన్నారు. ప్రస్తుతం దిగుబడి బాగా పెరిగిందని, మార్కెట్లో తగిన ధర లభిస్తే ఈ ఏడాది కాఫీ సాగుపై ఆధారపడిన రైతులకు లాభాలు వస్తాయన్నారు.

పందలూరు ప్రాంతంలోని కాఫీ చెట్లకు భారీగా కాసిన గింజలు



జీన్ హెన్రీ డ్యునంట్‌కు ఘన నివాళి



జీన్ హెన్రీ డ్యునంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

వేలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యునంట్ 115వ వర్ధంతిని కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు జనార్దనన్ అధ్యక్షత వహించగా, సెక్రటరీ శివవడివు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివాసన్, విజయకుమారి, కోశాధికారి పళని, సభ్యులు రమేష్‌కుమార్ జైన్, తంగవేలు, రాధాకృష్ణన్, రామచంద్రన్, శ్రీధరన్ సహా పలువురు పాల్గొని, జీన్ హెన్రీ డ్యునంట్ చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు.

బుద్ధిమాంద్యం పిల్లలతో దీపావళి సంబరాలు



కార్యక్రమంలో నిర్వాహకులు

వేలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేన్‌పాక్కంలో అన్నై థెరిస్సా మహిళలు, పిల్లల హోం ఉంది. ఇక్కడ 61 మంది బుద్ధిమాంద్యం పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో, బాగాయం రోటరీ సంఘం, జేమ్స్ రోటరీ సంఘం, వెస్ట్ రోటరీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆ చిన్నారులతో దీపావళి సంబరాలు జరుపుకున్నారు. పిల్లలకు కొత్త దుస్తులు, స్వీట్లు పంచిపెట్టారు. బాణసంచా అందజేయడంతో పాటు వారిచే టపాసులు కాల్పించారు. కార్యక్రమంలో రోటరీ సంఘం అధ్యక్షుడు సెల్వం, మోహన్, భాస్కర్, నందకుమార్, అన్నాదొరై, రవి, శేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

రష్యా దేశస్తుల రాహుకేతు పూజ



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రష్యాకు చెందిన పది మంది భక్తులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు రూ.750 టిక్కెట్‌తో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ శిల్పకళ ఎంతో అద్భుతంగా ఉందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శివాలయ శిథిలాలు కాపాడుకోవాలి

ఇది 400 ఏళ్ల నాటి శివాలయం. ఈ శిథిలాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అభిప్రాయపడ్డారు. చంద్రగిరి మండలం శానంబట్లలోని స్వర్ణముఖినది ఒడ్డున ఈ శివాలయ శిథిలాలున్నాయి. క్రీస్తుశకం 16-17 శతాబ్దాల నాటి ఒక పర్లాంగు పొడవు, అడుగున్నర వెడల్పు గల రాతి కోట గోడ అనవాళ్లు, వరదలకు నేలమట్టమైన ఆలయ శిథిలాలను శుక్రవారం ఆయన ఎస్వీయూ విశ్రాంత తెలుగుశాఖాధిపతి పేటశ్రీతో కలిసి పరిశీలించారు. చారిత్రాక ప్రాధాన్యం గల విజయనగరం కాలానికి చెందిన కోటగోడలు, ఆలయ శిథిలాలను పునరుద్ధరించి భావితరాలకు అందించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు చరిత్ర పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, ప్రకాష్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



వెలుగుల దీపావళి













రాత్రి వేళ.. ఎప్పటిలా ఉండే లైట్లతో పాటు టపాసుల వెలుగుల్లో తిరుపతి నగరం ఎలా ఉండిందనడానికి ఈ చిత్రాలే నిదర్శనాలు. దీపావళి సందర్భంగా గురు, శుక్రవారాల్లో రాత్రి సమయాన రంగురంగుల వెలుగులతో నగరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. చూపరులకు కనువిందు చేసింది. కాగా, పండుగ వేళ పల్లె పట్నం అనే తేడాలేకుండా జిల్లా అంతటా టపాసులతో మోతెక్కించారు. రాత్రివేళ శబ్దంతో పాటు వెలుగునిచ్చే టపాసులు కాల్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శాస్త్రోక్తంగా కేదారి గౌరీదేవి వ్రతం

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా కేదారి గౌరీదేవి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని శ్రీకృష్ణదేవరాయ మండపంలో కొలువుదీర్చారు. అభిషేక పూజల అనంతరం కలశస్థాపనచేసి వ్రతం చేపట్టారు. అమ్మవారికి మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై వ్రతం చేశారు. నోములు నోచుకుని నోముదారాలు స్వీకరించారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో అమ్మవారి ఆలయాల్లో, తమ ఇళ్ల వద్ద పలువురు నోములు నోచుకున్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నోములు నోచుకుంటున్న మహిళలు



బాణసంచా కాల్చే క్రమంలో
రేకు గుచ్చుకుని బాలుడి మృతి

● పలు ప్రాంతాల్లో 14 మందికి తీవ్ర గాయాలు

తిరుపతి(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసులు కాల్చే క్రమంలో 14 ఏళ్ల బాలుడు మృతిచెందగా, మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పుత్తూరు మండలం గోపాలకృష్ణపురం ఎస్టీ కాలనీకి చెందిన చరణ్(14) గురువారం రాత్రి రేకుపై టపాసు పెట్టి కాల్చాడు. ఆ టపాసు ధాటికి రేకు ఎగిరిపడి బాలుడి మెడపై గుచ్చుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని రుయాస్పత్రికి తీసుకొచ్చారు. మెడ లోపలి భాగం వరకు రేకు కోసుకుపోవటాన్ని గుర్తించి వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేశారు. బాలుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అలాగే పలు ప్రాంతాల్లో టపాసులు కాల్చే క్రమంలో మరో 14 మంది గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, టపాసులు కాల్చే క్రమంలో జరిగే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని రుయా అధికారులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు అప్రమత్తంగా ఉంటూ అత్యవసర విభాగంలో నిరంతరం ప్రత్యేక వైద్య సేవలను అందించారు.





గాయపడి, మృతిచెందిన చరణ్ - చికిత్స పొందుతున్న పలువురు బాధితులు

కళ్లలో కారం కొట్టి.. రాడ్లతో దాడి చేసి..!

● కడివేడు గ్రామంలో వ్యక్తి హత్య



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం కడివేడు అరుంధతివాడలో పాత కక్షల నేపథ్యంలో గురువారం రాత్రి ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. గోపాల్, రమణమ్మ దంపతుల కుమారుడు వెంకటేష్(35)కు, అదే ప్రాంతానికి చెందిన పొట్టేళ్ల సుబ్రహ్మణ్యం, పల్లెపాటి సాయికుమార్, సుళ్లూరు సునీల్‌తో పాత గొడవలున్నాయి. వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. కొంతకాలంగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్న వెంకటేష్ దీపావళి కోసం నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చారు. రెండు రోజుల కిందట వెంకటేష్, సుబ్రహ్మణ్యం మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సాయికుమార్, సునీల్‌తో కలిసి సుబ్రహ్మణ్యం గురువారం రాత్రి వెంకటేష్ ఒక్కడే ఇంట్లో ఉన్న సమయంలో కళ్లలో కారం చల్లి రాడ్లతో కొట్టి హత్య చేశారు. డీఎస్పీ రమణ కుమార్, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో వెంకటేష్ మృతదేహాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పరిశీలించి వారి కుటుంబీకులకు సానుభూతిని తెలియజేశారు.

మద్యం మత్తులో తండ్రిని హతమార్చాడు

వాకాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కని పెంచిన తండ్రినే మద్యం మత్తులో ఓ కొడుకు కడతేర్చాడు. ఈ ఘటన వాకాడు మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగబాబు తెలిపిన ప్రకారం.. తుపాకుల చిన్నరామయ్య(78), ఆయన కుమారుడు రమేష్ రోజువారీ కూలి పనులకు వెళ్లేవారు. దీపావళి పండుగ సందర్భంగా గురువారం రాత్రి తండ్రీ కొడుకులు కలసి మద్యం తాగారు. మద్యం మత్తులో వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాత్రి 9 గంటల సమయంలో మాటామాటా పెరిగి రమేష్ కర్ర తీసుకొని తండ్రి తలపై బలంగా కొట్టాడు. ఒక్కసారిగా చిన్నరామయ్య కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. తండ్రి చనిపోవడంతో రమేష్ పరారయ్యాడు. గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన చిన్నరామయ్య

ముక్కంటి ఆలయంలో జారిపడి భక్తురాలికి తీవ్రగాయాలు



గాయపడిన మమత

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జారి పడటి మమత(40) అనే భక్తురాలు తీవ్రంగా గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన ఈమె తిరుపతిలో నివాసం ఉంటున్నారు. గురువారం భార్యాభర్తలు ఆలయానికి రాగా.. అమ్మవారి సన్నిధి నుంచి వెలుపలకు వచ్చే సమయంలో స్వర్ణ తాపడ ఉత్సవమూర్తి వాహనల వద్ద నేలపై నూనె ఉంటంతో ఆమె జారి పడటంతో గాయపడ్డారు. శ్రీకాళహస్తిలోని ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లారు.

బాలికకు యువకుడి వేధింపులు

● ఫోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంటర్ చదువుతున్న ఓ బాలికను వేధిస్తున్న యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. సత్యసాయి జిల్లా వేపమానుపేటకు చెందిన టి. శివకుమార్ రెడ్డివారిపల్లిలోని ఓ బాలికల పాఠశాలకు వాహనంలో సిలిండర్లు సరఫరా చేసేవాడు. అక్కడ చదివే బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత బాలిక ఇంటర్ కోసం తిరుపతిలో చేరింది. అతడు తరచూ తిరుపతికి వచ్చి ఆ బాలికతో మాట్లాడేవాడు. ఈ క్రమంలో పెళ్లి ప్రపోజల్ తేగా ఆమె ఒప్పుకోలేదు. అతడు మాత్రం వేధిస్తూనే ఉన్నాడు. దీనిపై ఆమె తల్లి తండ్రులకు చెప్పడంతో బుధవారం వారు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శివకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ చెప్పారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురు తమిళనాడువాసుల అరెస్టు

తడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తడ రైల్వే స్టేషన్ వద్ద 46 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం తడ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు నిఘా పెట్టారు. స్టేషన్ బయట నలుగురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరగుతుండటాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా చెన్నైలోని ఆవడికి చెందిన ఎస్.రాజరాజన్, అంబత్తూరుకు చెందిన ఎస్.తమిళమణి, చెంగల్‌పట్టు జిల్లా చేయ్యుడూరుకు చెందిన ఎస్.సారధి, కోయ్యంబత్తూరుకు చెందిన పి.రమేష్‌గా తెలిసింది. వీరు శ్రీకాకుళం నుంచి గంజాయిని తమిళనాడుకు తీసుకెళుతున్నట్లు వెల్లడించారు. నలుగురు వ్యక్తుల నుంచి 46 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన ఎస్ఐ కొండపనాయుడు, సిబ్బందిని సీఐ అభినందించారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు



రన్ ఫర్ యూనిటీ



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పోలీసులు 'రన్ ఫర్ యూనిటీ (ఏక్తా యాత్ర)' నిర్వహించారు. తొలుత పటేల్ చిత్రపటానికి ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వరకు సాగింది. దేశ సమగ్రతను కాపాడిన ఉక్కు మనిషి పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే కోల్‌కాతా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, హ్యూమన్ రైట్స్ కమిషనర్ జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్యకంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి కూడా గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

లోకం శాంతిగా ఉండాలని ప్రార్థించా

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): లోకం శాంతిగా, సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి తెలిపారు. శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానంలో పాల్గొన్న ఆయన.. మీడియాతో మాట్లాడారు. ఈనెల 18 నుంచి జనవరి 1వ తేదీ వరకు అయోధ్యలో జరిగే మహా చండియాగానికి టీటీడీ కూడా సహకరిస్తోందన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో తిరుపతి నుంచి ఆయోధ్యకు శ్రీరామ యంత్రం పంపామని గుర్తుచేశారు. శ్రీవారి గర్భాలయంలోనూ శ్రీరాములవారి ఉత్సవమూర్తి విగ్రహం ఉందన్నారు. రాములవారికి తిరుమలకు ప్రత్యేక సంబంధాలున్నాయన్నారు. ఇక, టీటీడీ నూతన బోర్డులోని సభ్యులు మంచి సేవలు అందించాలని కోరారు.







ముక్కంటి ఆలయంలో 'ఆకాశదీపం'

శ్రీకాళహస్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశ దీపాన్ని వెలిగించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశాక స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.



జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్య